# సామెతకథలు

## గుడిపూడి జంగాలు

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

గుడిపూడి అనే గ్రామంలో కాపురం ఉండేవారంతా మూడువంతులు జంగాలే. వారిది భిక్షావృత్తి. ప్రొద్దున్నేలేచి స్నానంవగైరా నిత్యకృత్యాలు ముగించుకొంటారు. చల్దీ భుజించి, మెడలో లింగకాయ ఒకటి, నెత్తిన బుట్టటోపి, మోకాళ్ళవఱకు వేలాడే చొక్కా, చంక నొక్కజోలె, పెద్ద శంఖం, గంట వేలాడగట్టు కొంటారు. తలకొక్క గ్రామం చేరి యింటింట గంట వాయిస్తూ బిచ్చానికై వెళ్లుతూంటారు. తమ శక్తి కొద్దీ ధాన్యం బియ్యం గడించుకొని సాయంకాలానికి ఇల్లు చేరుకొంటూంటారు.

రాత్రులు భోజనంచేశాక వారందఱు నడువీధిని రచ్చబండ వద్ద సభ చేస్తారు. పదిమందిచేరాక ఎవరెవరే గ్రామం వెళ్ళింది, ఎంతెంత ఏ విధంగా గడించింది చెప్పుకొంటారు. ఎక్కడెక్కడ ఏమేమి విశేషాలు జరిగేవి చర్చకు వస్తాయి. ఒక సభ్యుడు లేచి "పెక్కు గ్రామాల్లో దూడల చెఱువు- మంచినీళ్ళ చెఱువు వేఱు వేఱుగా ఉంటున్నాయి. మన గ్రామంలో ఒక్కటే చెఱువు ఉండడంచేత దూడలకుగాని, స్నానపానాలకుగాని సుఖం లేక పోతోంది. కాబట్టి మనమంతా కలిసి ప్రత్యేకమైన మంచినీళ్ళ చెఱువు ఒకటి త్రవ్వించాలి" అనే తీర్మానం లేవదీస్తాడు. చాలా బాగుంది. తప్పకుండా యీపని రేపటి ఉదయమునుండే ప్రారంభించాలని అందరు తమ పూర్తి ఆమోదం తెల్పుతారు.

మఱొక్క సభ్యుడు లేచి "నేను ఈ రోజున వెళ్ళిన గ్రామంలో శివాలయం మహా వైభవంగా కన్నుల పండువ చేసింది. మనవూళ్ళో శివుని గుడి అట్లా శిథిలమై పాడుపడి ఉండడం మనవంటి శివభక్తులకు చాలా అవమానంగా తలవంపుగా తలుస్తాను. ఆలయాన్ని బాగుచేయించి నిత్య ధూప దీప నైవేద్యాలతో అర్చనలతో వైభవంగా ఉండేటట్లు చేయించడం చాలా అగత్యమైన పని" అని చెప్పేసరికి వల్లెయని సభ్యులంతా గొఱ్ఱె పొట్టేళ్ళలాగు తలలూపుతారు.

వేఱొక్కడు లేచి "చాలా కాలమునుండి ఆలోచనలో ఉంటూండడమే కాని మన గ్రామంలో నిత్యాన్నదానం చేసేటందుకు తగిన స్తోమతుతో ఒక్క ధర్మశాల, కచ్చేరీసావడి నిర్మించాలి. మీ వంటి పెద్దలంతా విరివిగా చందాలు విరాళాలు వసూలు చేయడానికై తప్పకుండా పూనుకొంటారని ఆశిస్తున్నాను" అని కూర్చుంటాడు. సభ్యులంతా బేష్, బేష్, శబాస్, సలహా చాలా బాగుంది అని గంగిరెద్దులలాగు తలలూపుతూ అన్నిటికంటె ముందు ఈ పని జరిగితీరాలని ఏకగ్రీవంగా ఆమోదిస్తారు.

రాత్రి పదిగంటలు కాగానే కండ్లునలుపుకొంటూ ఇండ్లకు పోయి నిద్రిస్తారు. మఱునటిదినం ఎవరిమట్టుకు వారు రాత్రి తీర్మానాలు మఱచిపోయి జోలె తగిలించుకొని భిక్షాటనానికిపోతారు. తిరిగి ఆనాటి రాత్రికూడా వెనుకటిరాత్రిలాగే ఇరుగు పొరుగు పెద్దలంతా గుమిగూడి ధర్మకార్య నిర్వహణ విషయంలో సలహాలు తీర్మానాలు స్వేచ్ఛగా కొనసాగిస్తారు. పగళ్ళు బిచ్చపు వృత్తితో రాత్రుళ్ళు ధర్మకార్యకలాపాల చర్చలు తీవ్రసమాలోచనలు చేస్తూండడంలో ఏండ్లూ పూండ్లూ గతించిపోతాయి.

అంతూపంతూలేని ఆలోచనలతోనే కాలంగడుపుతూ తమ సొంతపనులు చూచుకొంటూ ఉండే జనసంఘాన్ని గుడిపూడి జంగాలంటారు.*